హైదరాబాద్‌లో నేను నివసించే లంగర్ హౌస్ ప్రాంతం నించి మెహిదీపట్నం సెంటర్ దాకా వెళ్ళాలంటే మాకు సర్వీస్ ఆటో లే బస్సుల కంటే సౌకర్యంగా ఉంటాయి. మా యింటికి బాగా దగ్గరగా దొరుకుతాయి.

ఈ మధ్య ఓ రోజు సాయంకాలం మెహిదీ పట్నం వెళ్ళేందుకు అలాంటి సర్వీస్ ఆటో ఎక్కాను. అప్పటికే అందులో యిద్దరు ప్రయాణీకులు ఉన్నారు. కొత్త దంపతుల్లా కనిపించారు. ఆ అబ్బాయి వయసు ఏ పాతికేళ్ళో ఉండచ్చు. ఆ అమ్మాయి మరో రెండేళ్ళు చిన్నదేమో. ముచ్చ



# ప్రయాణ కాలక్షేపం

టగా ఉన్నారు. మధ్యతరగతి వాళ్ళని తెలుస్తూనే ఉంది.

నేను ఆటోలో ఎక్కేప్పటికే ఆ అమ్మాయి తన భర్తకు ఆవేశంగా ఉపన్యాసం యిస్తోంది.

"...ఇది మాత్రం బాగోలేదు కిషోర్. పండగ పండక్కీ మీ యింటిల్లిపాదికీ మావాళ్ళు బట్టలు పెట్టాలంటుంది మీ అమ్మ. అదెలా కుదురుతుంది? అదేమంటే మా యింట్లో అదే ఆనవాయితీ అంటుంది. మా వాళ్ళింట్లో అలా ఆనవాయితీ లేదు. ఏం చేస్తాం?"

"అమ్మ అలా అనలేదు. పండక్కి నీకు చీర పెట్టిన వాళ్ళు, అల్లుణ్ణి నాకూ బట్టలు పెడితే బాగుండేది అన్నది. అంతే. అయినా అదయిపోయింది గదా ఇంకా ఎందుకా గోల వదిలిపెట్టవు?" అన్నాడు ఆ అబ్బాయి.

"ఇప్పుడే కాదు. అప్పుడు ఆషాఢ పట్టీల గురించి కూడా చాలాసార్లు అన్నది మీ అమ్మ. మీ యింట్లో అందరికీ బట్టలు పెట్టాలంటుంది. అలాంటి పద్ధతి లేదంటారు మావాళ్ళు. అన్ని విషయాల్లో అంత మంచిగా ఉంటుంది. ఇలాంటి మాటలు ఎందుకంటుందోతెలియదు. నాకు మాత్రం చాలా కష్టంగా ఉంటోంది. మా యింట్లో ఆడపిల్లలూ, మగపిల్లలూ అంతా ఒకటే మావాళ్ళకు. మీ అమ్మకు అలా కాదనుకొంటాను."

"అబ్బ, పోనియ్యి. నీ ధోరణి నీది, ఆమె ధోరణి ఆమెది. మా యింట్లో ఆనవాయితీ ఆమె చెప్పిందేమో. మీ వాళ్ళెలాగూ చెయ్యలేదు. దానిమీద యిప్పుడెందుకు రభస?"

"రభసేమిటండీ, మీరు మీ అమ్మకు చెప్పాలి. ఆమె అలా ఎప్పుడూ డామినేటింగ్‌గా మాట్లాడుతుంటే నాకు బాగుండదు. మంచి ఆవిడేగానీ పండగ బట్టలు ఎవరిచేతో పెట్టించుకోవాలని అంత తాపత్రయం ఎందుకు?"

"ఎవరో పెట్టాలని ఆమె అనలేదు. ఈ సందర్భాలలో యిది మా యింటి సంప్రదాయం అన్నది. ఎవరినో బిచ్చమెత్తాల్సిన అవసరం, అలవాటూ ఆమెకి లేదని నీకూ తెలుసు." అన్నాడు ఆ అబ్బాయి. వాళ్ళు మాట్లాడే విషయమూ, మాటలూ కొంచెం సీరియస్ వ్యవహారమే అయినా వాళ్ళు మాట్లాడే ధోరణి చూస్తే అలా అనిపించలేదు. కొంత ఆవేశంగా, ఏదో టీవీ సీరియల్ సీన్ గురించి వాదించుకొన్నట్టు మాట్లాడుతున్నారు. చుట్టుపక్కల ఎవరయినా వింటారేమోనన్న ధ్యాస యిద్దరికీ లేదు.

"అలా కాదండీ, ఆమె అలా డామినేషన్ చేస్తే నాకు చాలా బాధగా ఉంటుంది. మీరు మీ అమ్మకు చెప్పాలి. లేకపోతే ఆమె అలా అంటూనే ఉంటుంది." అంది ఆ పిల్ల.

**యం. హనుమంతరావు**

"నేను అమ్మకు చెప్పాల్సిందీ లేదు, నీకు చెప్పాల్సిందీ లేదు. ఈ గొడవ యింతటితో నువ్వా ఆపేయి." అన్నాడు కిషోర్.

"అలా అంటే ఎలాగ కిషోర్? రేపు మళ్ళీ పండగొచ్చినప్పుడు మళ్ళీ మీకు మావాళ్ళు బట్టలు పెట్టాలంటుంది. నేను వెళ్ళి మా నాన్నను అడగాలా? మన పెళ్ళి కాకముందే మీకు చెప్పాను. ఆ రోజు మనం ఐమాక్స్ థియేటర్‌లో సినిమాకి వెళ్ళినప్పుడు. నేను యిరవయి రెండేళ్ళలో మా వాళ్ళని ఏదీ కావాలని అడిగి యిబ్బంది పెట్టలేదు. కాలేజీలో, పీజీలో చదివేటప్పుడు కూడా మా నాన్న ఎంత డబ్బిస్తే దాంతో సర్దుకొనేదాన్ని. ఇంకా డబ్బు కావాలని నేనెప్పుడూ అడగలేదు. ఇప్పుడెలా అడిగేది?"

"అడగకు, అడగమని నేను చెప్పలేదే?"

"మీ అమ్మ అలా మాట్లాడుతుంటే మరేం చెయ్యాలి చెప్పండి? అయినా నేను యంసీఏ చేసాను. రేపోమాపో నాకూ ఉద్యోగం వస్తుంది. వస్తే ఆ జీతమంతా మీ చేతిలోనే కదండీ పోస్తాను. ఇంతలో యిలాంటి మాటలనొద్దని మీ అమ్మకు మీరు గట్టిగా చెప్పాలి."

"మళ్ళీ మొదటికొస్తున్నావు. నేను చెప్పేదేమీ లేదు. నువ్వే చెప్పుకో."

"నాకు మొహమాటం గదండీ. పాపం ఆవిడ నాతో మిగతా అన్ని విషయాల్లో ఎంతో బాగుంటుంది. ఈ ఒక్కటీ ఆమెకు మీరు చెప్తే బాగుంటుంది." అంది ఆ అమ్మాయి.

ఇంతలో ట్రాఫిక్‌జామ్‌లో మా ఆటో ఆగిపోయింది. ఈ సంభాషణ జరుగుతున్న సమయంలో ఆటో డ్రైవర్ రెండు మూడు సార్లు వెనక్కి తిరిగి చికాగ్గా మొహం పెట్టడం గమనించాను కానీ అతని చికాకు దేని గురించో నాకు అర్థం కాలేదు. కానీ యిప్పుడు ఆటో ఆగిన తర్వాత మళ్ళీ వెనక్కి తిరిగి చిరాగ్గా చూసాడు.

"మీరెక్కడ దిగుతారు?" కొంచెం విసుగ్గానే అడిగాడు ఆ దంపతుల్ని.

"బస్ డిపో దాకా వెళ్ళాలి. ఏం అక్కడి దాకా వెళ్ళటం లేదా నువ్వు?" అంది ఆ అమ్మాయి.


"మీరు వెళ్ళాలంటే తీసుకెళ్తాను. కానీ మీరలా కేకలు వేస్తూ మాట్లాడుతుంటే బాగుండదు." అన్నాడు ఆటో డ్రైవరు.

"మేమేమీ కేకలు వేయట్లేదు. మాట్లాడుకొంటున్నాం. అయినా ఎవరిమీద కేకలు వేస్తే ఎవరూరుకొంటారు. నువ్వూరుకొంటావా? ఊరుకొన్నా నీ మీద కేకలు వేయడం మాకేం పని?" అంది ఆ పిల్ల. నీ పేరేమిటి అంటే జవాబు చెప్పినంత సాదా సీదాగా ఉంది ఆ అమ్మాయి మాట. ఆమె భర్త మాట్లాడనే లేదు.

"ఎవరి మీద కేకలని కాదు. ఇంటి విషయాలు మీరు ఎక్కడో వేరుగా ఒక్కళ్ళే కూర్చొని చర్చించుకోవాల్సినవి యిలా నలుగురి మధ్యలో పబ్లిగ్గా మాట్లాడుకొంటే బాగుండదు." అన్నాడు ఆటో డ్రైవర్ కొంచెం కోపంగానే.

ఆ అమ్మాయికి కోపమేమీ వచ్చినట్టు లేదు.

"భలేవాడివయ్యా, మా సమస్యలు మేం మాట్లాడుకొంటుంటే మధ్యన నీకేమిటీ యిబ్బంది? నిన్ను పరిష్కారం అడిగామా, వినమన్నామా? నీ పని నువ్వు చేసుకొంటున్నావు, మా మాటలు మేం చెప్పుకొంటున్నాం. ఎక్కడో వేరుగా, ఏకాంతంగా కూర్చొని యివన్నీ మాట్లాడుకొనే అవకాశం మాకుంటే ఆటోలో ఎందుకు మాట్లాడుకొంటాం? ఆయన ఉద్యోగానికి కరీంనగర్ వెళ్ళాలి, నేను మావాళ్ళింటికి దిల్‌సుఖ్‌నగర్ వెళ్ళాలి. మళ్ళీ శనివారం దాకా కలవం.




అయినా మేమేమీ పది మంది బంధువుల మధ్య మాట్లాడటం లేదు. నువ్వెవరో నాకు తెలీదు. ఈ ఆటో దిగిపోతే నువ్వెవరో, మేమెవరో? మా మాటలు నువ్వు వింటే మాకేం నష్టం లేదు. నీకేమన్నా కష్టమయితే చెప్పు, నీ ఆటోలో కూర్చొన్నంతసేపూ మాట్లాడం" అంది. ఆమె ధోరణి చూస్తే, మీదే ఊరమ్మా అంటే మాది అనంతపురం అని చెప్పినంత సాధారణంగా ఉంది.

ఆ అమ్మాయి భర్త మౌనంగానే ఉండిపోయాడు.

డ్రైవరే మళ్ళీ అన్నాడు: "నాకేం కష్టం? నా కష్టం గురించి కాదు నేననేది. ఇంటి విషయాలు మీలో మీరు మాట్లాడుకోకుండా యిలా నడి వీధిలో అరుచుకొంటుంటే, మీకే పరువుగా, మర్యాదగా ఉండదని చెప్పాను. ఆ తర్వాత మీ యిష్టం." ఇంతలో ట్రాఫిక్ నిదానంగా కదిలింది. ఆటోని మెల్లిగా పోనిస్తూ, "పైగా యిలాగ అత్తగార్ని ఆడిపోసుకోవటం ఏమీ బాగాలేదు. వాళ్ళింటి పద్ధతి ఆమె చెప్పింది. తప్పేమిటి? పెళ్ళయిన మొదటి సంవత్సరం బట్టలు పెడితే ఏం లక్షలు ఖర్చవుతయ్? మొన్న మా అమ్మాయికీ, అల్లుడికీ నేను పండగ బట్టలు కొనిచ్చాను. సంతోషంగా యిచ్చాను. అదో పెద్ద విషయమా?" అన్నాడు డ్రైవర్.

చాలా అనవసర ప్రసంగం చేస్తున్నాడీ డ్రైవరని నాకనిపించింది. కానీ ఆ అమ్మాయి అలా అనుకొన్నట్లు లేదు.

"అదేమిటి? ప్రశ్న అది కాదు. మీ యింట్లో ఆనవాయితీలు మీరు జరుపుకోండి. మమ్మల్నెందుకు బలవంతం చేస్తారూ అన్నది ప్రశ్న. రెండు, మూడు సార్లు బట్టలు పెట్టిన తర్వాత, పోయిన పొడుగూతా ఎన్నిసార్లు పెడతారు? వాళ్ళంతట వాళ్ళు పెడితే అదో దారి. పెట్టాలని అడగటం తప్పుకదా..." అని ఆ అమ్మాయి వాదం సాగదీస్తుండగానే వాళ్ళు దిగాల్సిన స్టాప్

వచ్చింది. భర్త డ్రైవర్‌కు డబ్బులిచ్చాడు. భార్యా భర్తలు దిగి, చేతులు కలుపుకొని నడుస్తూ వెళ్ళిపోయారు చిలకాగోరింకల్లాగా. ఆ అమ్మాయి యింకా ఏదో చెబుతున్నదని దూరానికి కూడా కనిపిస్తున్నది. ("...మీ అమ్మకు మీరు గట్టిగా చెప్పాలి, కిషోర్..." అంటున్నదేమో బహుశా.)

ఇప్పుడు ఆటోలో నేనొక్కణ్ణీ ప్రయాణీకుణ్ణి.

"చూసారా సార్, వీళ్ళ జోరు." అన్నాడు ఆటో డ్రైవర్.

నేను జవాబివ్వలేదు. ఆ జంట సంభాషణ నాకూ విచిత్రంగానే అనిపించినా, నాకూ, ఈ ఆటో డ్రైవర్‌కీ ఎందుకూ వాళ్ళ విషయం? అని నా అభిమతం.

"అలాగెవరయినా యింటి వ్యవహారాలు అంత సిగ్గూ లజ్జా లేకుండా బజార్లో వేసుకొంటారండీ. ఎంత చదివితే ఏం లాభం? ఈ కాలం పిల్లలతో చాలా కష్టం. ఆ టెక్కు చూడండి... అత్తగార్ని మీ అమ్మ, మీ అమ్మ అంటూ..." అన్నాడు డ్రైవరే మళ్ళీ.

"వాళ్ళ ఊసు మనకెందుకయ్యా. ఏదో కుర్రతనం. వాళ్ళ పిచ్చి వాళ్ళది. మనం పట్టించుకోవడం అనవసరం. వాళ్ళ సమస్యలు వాళ్ళే శుభ్రంగా పరిష్కరించుకొంటారు. చూడలా చెట్టాపట్టాలేసుకొని హాయిగా నడిచిపోతూంటే జోడీ మాత్రం చూడముచ్చటగా ఉంది"

అన్నాను నేను.

"అయితే మాత్రం... పిచ్చి పిచ్చిగా ప్రవర్తిస్తూంటే హెచ్చరించొద్దా?" అన్నాడు డ్రైవర్. అతని ధోరణి కూడా కొంత అతిగానే అనిపించింది నాకు.

"ఎవరు హెచ్చరించాలయ్యా? నీకూ నాకూ ఏం సంబంధమని? వాళ్ళు మనల్నేమీ అడగలేదు. మన జోలికి రాలేదు. పోతే గలగలా వాగటమా... చిన్నతనం. మనకెందుకూ? వదిలేయటం బెస్ట్." అన్నాను.


"అయ్యో రాత! మీరు యిది చూసారు. వీళ్ళ అత్తగారి సంగతి మీకు తెలియదు. చాలా మంచావిడ. పేరు ప్రభావతి గారు. భోళా మనిషి. ఒక మాటలో చెప్పాల్సింది పది మాటల్లో చెబుతుంది. ఈ పిల్ల కంటే యింకా లొడా లొడా మాట్లాడుతుంది. ఇంకో సంగతి తెలుసా మీకు? ఈ అమ్మాయి ఆమెకి వరసకి మేనకోడలే. తమ్ముడి వరస బంధువు కూతురు. పిల్ల బుద్ధిమంతురాలనీ, చక్కనిదనీ, చదువుకొన్నదనీ కానీ కట్నం లేకుండా కోడలుగా తెచ్చుకొంది. కాకపోతే కొంచెం సణుగుడు మనిషి. కొడుకునూ కోడల్నీ నెత్తిన పెట్టుకొంటుంది, కానీ మాట పెళుసు. మనసయితే వెన్నపూసే" అన్నాడు డ్రైవర్. నాకు ఆశ్చర్యం వేసింది.

"నీకెలా తెలుసయ్యా యిన్ని వివరాలు, అంజనం వేసి కనుక్కొన్నావా ఏమిటీ? పైగా వాళ్ళ మనసులో విషయాలు కూడా చెప్పేస్తున్నావు. నీకేమయినా వాళ్ళు బంధువులా కొంపదీసి?" అన్నాను.

"అబ్బే... మా బంధుత్వం – అదేదో అంటారే బాదరాయణ సంబంధమనీ, అట్లా. వాళ్ళింట్లో రేగి చెట్టుంది, మా యింట్లోనూ ఉంది"

ఎందుకే ఇంత డార్క్ చీరలు కొన్నావు? చిరాకుపడ్డాడు భర్త.

స్టీల్ సామాన్లవాడు లైట్ కలర్ చీరల్ని ఇష్టపడడం లేదండీ... గారాలుపోయింది ముందుచూపుగల భార్య.




అని పెద్దగా నవ్వాడతను. "విషయమేమిటంటే ఈ పిల్ల అత్తగారూ, మామగారూ అప్పుడప్పుడూ నా ఆటోలో ఎక్కి లంగర్ హౌస్ నించి మెహిదీపట్నం దాకా వస్తూ ఉంటారు. ఆటో ఎక్కినప్పట్నుంచీ దిగే దాకా ఆమె మాట్లాడుతూనే ఉంటుంది. అదీ ఎస్వరలక్ష్మి గొంతుతో బిగ్గరగా. ఇప్పుడు నేను చెప్పిందంతా ఆమె నా ఆటోలో కూర్చొని మాట్లాడుతుంటే విన్న విషయాలే. ఆయనేమో అది కాదు ప్రభావతీ, యిది కాదు ప్రభావతీ అంటూ ఉంటాడు. ఏది కాదండీ... అని ఈమె గంగా ప్రవాహంలాగా ఉపన్యాసం యిస్తుంటుంది. ఆ ఉపన్యాసాలు విని ఆ యింటి స్థితిగతులు కొంచెం తెలుసుకొన్నాను. ఇవాళ ఈ పిల్ల ఘోష విని మరి కొంచెం అవగాహన సంపాదించాను. అందుకే ఈ పెంకి పిల్ల చిన్న విషయం ఊరికే సాగదీస్తున్నదని నాకు కోపం వచ్చింది."

"చిత్రంగా ఉందయ్యా నువ్వు చెప్పేది. ఆ మాటకొస్తే అత్తా కోడళ్ళ పేచీలు యింటింటి భాగోతమే కదా" అన్నాను నేను. నా స్టాప్ వచ్చింది. ఆటో దిగి డబ్బులిస్తూ డ్రైవర్‌తో నా చిన్న సందేహం వెలిబుచ్చాను. "ఇంతకీ ఈ పిల్ల ఆ ప్రభావతిగారి కోడలని నీకెలా తెలుసు?"

"అదా? క్రితం వారం ఈ అత్తా కోడళ్ళు యిద్దరూ వచ్చారు నా ఆటోలో మెహిదీపట్నం నించి లంగర్ హౌస్ దాకా. వాళ్ళని చూస్తే మీరు తల్లీ, కూతుళ్ళనుకొంటారు. అంత ఆప్యాయంగా, క్లోజ్‌గా ఉన్నారు" అన్నాడు డ్రైవర్.

నాకో చిన్న సందేహం మళ్ళీ. ఆఖరి సందేహం. "మరి యిద్దరూ ఒకే ఆటోలో ప్రయాణం చేస్తే, ఎవరి ఉపన్యాసం ఎవరు విన్నారు? యిద్దరూ ఉద్దండులు కదా!" అని అడిగాను.

"అది నాకూ తెలీదు. ఆ రోజు ఆటోలో ఏడుగుర్ని కుక్కేయాల్సి వచ్చింది. అంచేత మాట్లాడేందుకు వాళ్ళిద్దరికీ ఛాన్సు రాలేదు." అంటూ డ్రైవర్ ఆటోతో కదిలిపోయాడు. ●